# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

ఆదివారం | 23 నవంబర్ 2025 | పేజీలు 8


## ఐదుగురు ఎమ్మెల్యేలకు
# డీసీసీ పీఠాలు

- ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్ నగరాలకు తొలిసారిగా డీసీసీ అధ్యక్షులు
- పెండింగ్‌లో సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల పదవులు
- 36 మంది డీసీసీ అధ్యక్షులను ప్రకటించిన కాంగ్రెస్
- బడుగువర్గాలకు పెద్దపీట



బడుగువర్గాలకు పెద్దపీట వేస్తూ జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ)లకు కొత్త అధ్యక్షులను పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. మొత్తం 36 మంది డీసీసీ అధ్యక్షుల పేర్లను ప్రకటించగా... వీరిలో ఐదుగురు ఎమ్మెల్యేలు, ఒక కార్పొరేషన్ ఛైర్మన్ ఉన్నారు. గతానికి భిన్నంగా ఈసారి ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్ నగరాలకు తొలిసారిగా డీసీసీ అధ్యక్షులను నియమించారు. ఖమ్మం డీసీసీకి దీపక్ చౌదరిని, కరీంనగర్‌కు అంజన్‌కుమార్‌ను, నిజామాబాద్‌కు బొబ్బిలి రామకృష్ణలను పార్టీ నియమించింది. ఈ మూడు జిల్లాల్లోని మిగతా ప్రాంతాలకు ఒక్కో డీసీసీ అధ్యక్షుడిని ఎంపిక చేశారు. సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా ఎవర్నీ నియమించకుండా పెండింగ్‌లో పెట్టారు.

**సామాజిక సమతౌల్యంతో...**

పదవుల భర్తీలో సామాజిక సమతౌల్యాన్ని పాటించడంతో పలువురు బడుగువర్గాల నేతలకు డీసీసీ పీఠాలు దక్కాయి. 15 మంది బీసీలను, ఐదుగురు ఎస్టీలను, ముగ్గురు ఎస్సీలను డీసీసీ అధ్యక్షులుగా నియమించారు. ఎస్టీల్లో

-మిగతా 2లో

-మిగతా 2లో

## సీఎం భూ కుంభకోణానికి
# తెరతీశారు

### భాజపా ఎంపీ కె.లక్ష్మణ్ ఆరోపణ



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పారిశ్రామిక భూములను లాక్కొని బడాబాబులకు కట్టబెట్టేందుకు భారీ భూ కుంభకోణానికి తెరతీస్తున్నారని భాజపా ఎంపీ కె.లక్ష్మణ్ ఆరోపించారు. ఆయన శనివారం దిల్లీలోని తన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. దాదాపు 10 వేల ఎకరాల పారిశ్రామిక భూములను సీఎం లాక్కుంటున్నారని, దిల్లీకి కప్పం కట్టేందుకే ఆయన ఈ కుంభకోణానికి పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు.

'భారత రాష్ట్ర సమితి హయాంలో కేసీఆర్ కూడా ఇందిరాపార్కు, ఎన్టీఆర్ స్టేడియం భూములను లాక్కొనేందుకు ప్రయత్నిస్తే భాజపా అడ్డుకొంది. ఇప్పుడు కూడా రేవంత్‌రెడ్డి కుట్రలకు వ్యతిరేకంగా పోరాడుతాం' అని లక్ష్మణ్ పేర్కొన్నారు. పార్టీ వ్యతిరేక వ్యాఖ్యలు చేసినందుకు అధిష్ఠానం రాష్ట్రంలోని ఓ ఎంపీకి నోటీసు ఇచ్చిన విషయం తన దృష్టికి రాలేదని ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

## 26లోపు ప్రాజెక్టుల నిర్మాణ ప్రణాళిక ఇవ్వండి

**ఆర్థికశాఖలో దస్త్రాల పెండింగ్‌పై ప్రశ్నించిన మంత్రి ఉత్తమ్**

**తుమ్మిడిహెట్టి డీపీఆర్ త్వరగా పూర్తి చేయాలని ఆదేశం**



రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు ప్రాజెక్టుల నిర్మాణాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటుంటే.. మరోవైపు పనుల్లో జాప్యం ఎందుకు జరుగుతోందని అధికారులను నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించినట్లు తెలిసింది. 6, 12, 18 నెలలు.. ఇలా రానున్న 36 నెలల్లో ప్రాధాన్య పద్ధతిలో పనులు పూర్తి చేసేలా ఈ నెల 26లోపు ప్రణాళిక సమర్పించాలని ఆదేశించినట్లు సమాచారం. ఈ సందర్భంగా పలు దస్త్రాలు ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉంటున్నాయని కొందరు అధికారులు తెలపగా.. తనకలాంటి సమాచారమేదీ లేదన్న మంత్రి... దీనిపై స్పష్టత ఇవ్వాలని సూచించినట్లు తెలిసింది.

## హైదరాబాద్ లో మరో బైపోల్..?

**.రాజీనామా యోచనలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం..?**




**హైదరాబాద్ పెన్ పవర్:**ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ రాజీనామా చేస్తారని తెలుస్తోంది. పార్టీ ఫిరాయింపులకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న పది మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు పంపిన విషయం తెలిసిందే. రెండో సారి కూడా నోటీసు అందుకున్న దానం నాగేందర్ ఇప్పటి వరకు ఎలాంటి వివరణ ఇవ్వలేదు. నోటీసుల గడువు రేపటితో ముగియనుంది నేడు ఆదివారం కావడంతో ఆయన

-మిగతా 2లో

- ఇబ్బందికరంగా సికింద్రాబాద్ ఎంపీగా పోటీ
- అనర్హత వేటుకు ముందే రాజీనామా యోచన?
- స్పీకరు కలిసి గడువు కోరనున్న ఎమ్మెల్యే
- రేపు రిజైన్ చేస్తారని ప్రచారం

## హైదరాబాద్ లో మరో బైపోల్..?

- మొదటి పేజీ తరువాయి

కీలక నిర్ణయం తీసుకోబోతున్నట్లు సమాచారం. కడియం శ్రీహరి నిన్ననే స్పీకర్ ను కలిసి మరింత సమయం కావాలని విజ్ఞప్తి చేశారు. దానం నాగేందర్ సికింద్రాబాద్ ఎంపీగా పోటీ చేశారు. కాంగ్రెస్ పార్టీ గుర్తుపై పోటీ చేసినందున ఆయనపై అనర్హత వేటు పడే అవకాశం ఉందని న్యాయనిపుణులు చెబుతున్నారు. దీంతో అనర్హత వేటు పడకముందేతన శాసన సభ్యత్వానికి రాజీనామా చేయాలని యోచిస్తున్నట్టు సమాచారం. ఇందులో భాగంగా ఉదయం అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులుతో భేటీ అయ్యారు. ఈ క్రమంలో స్పీకర్ గడువు కోరి, ఆ తర్వాత రాజీనామా చేయాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా నిన్న, మొన్నదానం నాగేందర్ ఢిల్లీలోనే ఉన్నారు. కాంగ్రెస్ పెద్దలతో భేటీ అయినట్టు సమాచారం. తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపి స్తానని, పదవి వదులుకుంటున్నందుకు తనకు రాజ్యసభ సభ్యత్వం లేదా.. ఎమ్మెల్సీ పదవి ఇచ్చి కేబినెట్ హోదా కల్పించాలని కోరినట్టు ప్రచారం జరుగుతోంది. పీసీసీ చీఫ్, సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడిన తర్వాతే స్పష్టత ఇస్తా మని దానం నాగేందర్ కు చెప్పినట్టు తెలుస్తోంది. దీంతో హైదరాబాద్ చేరుకున్న దానం శ్రీధర్ బాబును కలిసినట్టు తెలుస్తోంది. ఇవాళ సాయంత్రం గడువు కోరి సోమవారం స్పీకర్ కు రాజీనామా పత్రం సమర్పిస్తారని సమాచారం. ఏది ఏమైనా హైదరాబాద్ నగరంలో మరో ఉప ఎన్నిక ఖాయంగా కనిపిస్తోంది. ఇదిలా ఉండగా ఖైరతాబాద్ ఉప ఎన్నిక కోసం అటు బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కూడా రెడీ అవుతున్నట్టు తెలుస్తోంది.

## 26లోపు ప్రాజెక్టుల నిర్మాణ ప్రణాళిక ఇవ్వండి

- మొదటి పేజీ తరువాయి

శనివారం హైదరాబాద్‌లోని జలసౌధలో ప్రాధాన్య ప్రాజెక్టులపై నిర్వహించిన సమీక్షలో మంత్రి ఉత్తమ్ పలు అంశాలపై ప్రశ్నిస్తూ... ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. కల్వకుర్తి ఎత్తిపోతల్లోని ప్యాకేజీ 29 సవరించిన అంచనాలు భారీగా పెరగడంపైనా ఆరా తీయగా.. భూ సేకరణ తదితర కారణాలు ఉన్నాయని ఇంజినీర్లు పేర్కొన్నారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మించేందుకు సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) తయారీని వేగంగా పూర్తయ్యేలా చూడాలని ఉత్తమ్ ఆదేశించగా.. దీనిపై తుది నిర్ణయానికి డిసెంబరు ఐదో తేదీ వరకు సమయముందని ఇంజినీర్లు చెప్పినట్లు సమాచారం. "కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణను ఎన్డీఎస్ఏ సూచనల మేరకు చేపట్టాలి. ఆసక్తి వ్యక్తీకరణ పద్ధతిలో వచ్చే నెల ఐదో తేదీ నాటికి సంస్థల ఎంపిక ప్రక్రియను ముగించాలి. గౌరవెల్లి, డిండి, సీతమ్మసాగర్ ప్రాజెక్టులకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా కేంద్రం నుంచి పర్యావరణ అనుమతులు సాధించాలి. సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్వోసీ పొందడంపై దృష్టి పెట్టాలి" అని అధికారులకు మంత్రి సూచించినట్లు సమాచారం. ఈ సందర్భంగా గౌరవెల్లి ప్రాజెక్టు కింద భూసేకరణ పూర్తి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ రైతులతో కలిసి ఉత్తమ్‌కు విన్నవించారు.

# ఐదుగురు ఎమ్మెల్యేలకు డీసీసీ పీఠాలు

- మొదటి పేజీ తరువాయి

లంబాడీ సామాజికవర్గానికి చెందిన ముగ్గురు, గోండు సామాజికవర్గానికి చెందిన ఇద్దరు ఉన్నారు. లంబాడీలకు మంత్రివర్గంలో చోటులేదని ఆ వర్గం నుంచి అభిప్రాయం వ్యక్తమవుతున్న నేపథ్యంలో పెద్దపీట వేశారు. ఇద్దరు ముస్లింలకు, ఓ క్రైస్తవ మైనార్టీ నేతకు డీసీసీ పదవి దక్కింది.

**తొలిసారి శాసనసభ్యులు...**

తొలిసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన మేడిపల్లి సత్యం (చొప్పదండి)ని కరీంనగర్‌కు, రాజ్‌ఠాకూర్ (రామగుండం)ను పెద్దపల్లికి, వెడ్మ బొజ్జు (ఖానాపూర్)ను నిర్మల్‌కు, చిక్కుడు వంశీకృష్ణ (అచ్చంపేట)ను నాగర్‌కర్నూల్‌కు, బీర్ల అయిలయ్య (ఆలేరు)ను యాదాద్రి భువనగిరి డీసీసీ అధ్యక్షులుగా పార్టీ ఎంపిక చేసింది. క్రిస్టియన్ ఆర్థిక సంస్థ ఛైర్మన్ కె.దీపక్‌జాన్‌ను సికింద్రాబాద్‌కు, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డిని వనపర్తి డీసీసీ అధ్యక్షుడిగా నియమించింది.

**ఐదుగురు మహిళలు**

మొత్తం 36 మంది డీసీసీ అధ్యక్షుల్లో ఐదుగురు మహిళలున్నారు. వారు అంక్షారెడ్డి (సిద్దిపేట), ఆత్రం సుగుణ (కుమురంభీం ఆసిఫాబాద్), తోట దేవిప్రసన్న (భద్రాద్రి), లకావత్ ధన్వంతి (జనగామ), భూక్యా ఉమా (మహబూబాబాద్). ప్రస్తుత సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి కుమార్తె అంక్షారెడ్డిని ఆయన స్థానంలో నియమించడం గమనార్హం. నర్సారెడ్డిపై ప్రత్యర్థి వర్గం తీవ్ర ఆరోపణలు చేయడంతో పార్టీ క్రమశిక్షణ కమిటీ విచారణ చేస్తున్న నేపథ్యంలో ఈ మార్పు చేసినట్లు తెలుస్తోంది.

**శ్రేణుల అభిప్రాయాలు సేకరించి...**

డీసీసీ అధ్యక్షుల ఎంపిక నేపథ్యంలో ఏఐసీసీ నియమించిన పరిశీలకులు గత నెలలో క్షేత్రస్థాయిలో పర్యటించి... పార్టీ శ్రేణుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఒక్కో డీసీసీకి సామాజికవర్గాల వారీగా ముగ్గురు నేతల పేర్లతో జాబితాను ఏఐసీసీకి వారు సమర్పించారు. అందులో నుంచి ఒక్కో పేరును అధికారికంగా ప్రకటించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. సంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలిగా మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సతీమణి నిర్మల పేరు ప్రకటిస్తారని ప్రచారం జరిగినా జాబితాలో ఆ స్థానం లేకపోవడం గమనార్హం. ఇక రంగారెడ్డి జిల్లా నుంచి రాష్ట్ర మంత్రివర్గంలో ఎవరూ లేకపోవడం, డీసీసీ అధ్యక్ష పదవి భర్తీ కూడా దాంతో ముడిపడి ఉండటంతో ఎవరి పేరూ ప్రకటించలేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# ఆర్జీవీ లాజిక్... నెటిజన్లకు షాక్



హైదరాబాద్, నవంబర్ 22

గత కొద్ది రోజులుగా అటు ఇండస్ట్రీ ఇటు సోషల్ మీడియా ఎక్కడ చూసినా ఒకటే టాపిక్... అదే 'ఐబొమ్మ రవి'. ఫుల్ క్వాలిటీ పైరసీ మూవీస్‌తో ఇండస్ట్రీకి కోట్లలో నష్టం తెచ్చి నిర్మాతలకు కంటి మీద కునుకు లేకుండా చేశాడు. ఎట్టకేలకు పోలీసులు అతన్ని అరెస్ట్ చేసి ఐబొమ్మ, %BAPPAM% సైట్స్ క్లోజ్ చేయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే, నెటిజన్లు మాత్రం రవిని రాబిన్ హుడ్‌తో పోలుస్తున్నారు. తాజాగా... సెన్సేషనల్ డైరెక్టర్ ఆర్జీవీ రవి కేసుపై రియాక్ట్ అయ్యాడు. ఐబొమ్మ రవిని విమర్శిస్తూనే... ఆన్‌లైన్‌లో పైరసీ మూవీస్ చేసే వారికి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు ఆర్జీవీ. రవిని రాబిన్ హుడ్‌తో పోల్చడంపై తనదైన శైలిలో రియాక్ట్ అయ్యారు. 'మూవీస్ పైరసీ ఎప్పటికీ ఆగదు. టెక్నాలజీ డెవలప్ కావడం, పోలీసింగ్ చాలా బలహీనంగా ఉండడం వల్ల కాదు. పైరేటెడ్ మూవీస్ చూసేందుకు ఆడియన్స్ ఇంట్రెస్ట్ చూపించేంత వరకూ వారికి సర్వీస్ చేయడానికి ఇలాంటి రవిలు ఎల్లప్పుడూ ఉంటారు. ఇక్కడ హాస్యాస్పదం ఏంటంటే రవి సపోర్టర్స్ ఏదో నోబెల్ బహుమతి గెలుచుకున్న ఆలోచనను ఇన్వెంట్ చేసినట్లుగా అతన్ని రాబిన్ హుడ్‌తో పోల్చడం.రాబిన్ హుడ్ హీరో కాదు. నేటి నిర్వచనాల ప్రకారం వరల్డ్‌లోనే ఫస్ట్ ఉగ్రవాదిగా అతనిపై ముద్ర పడింది. అతను ఉన్న వారిని దోచుకుని, చంపి లేని వారికి ఇస్తాడు. రిచ్చెస్ట్ పర్సన్స్ చేసే ఏకైక నేరం వారు ధనవంతులు కావడమే. ఆర్థికంగా సక్సెస్ సాధించడం అనేది దొంగతనం, హత్య, శిక్షార్హమైన నేరం అని అనుకోవడం ఎంత నీచమో ఊహించుకోండి.' అంటూ కామెంట్ చేశారు.చోరీ చేసిన వస్తువులను తీసుకునే వారు ఫ్రీగా పొందుతున్నారనే కారణంతో నిందితుడిని సాధువుగా చూపించేందుకు టన్నుల కొద్దీ అజ్ఞానం అవసరమని రామ్ గోపాల్ వర్మ అభిప్రాయపడ్డారు. 'మూవీ కాస్ట్‌లీ అయితే పైరసీ సపోర్ట్ చేస్తారా?, పాప్ కార్న్ ధర ఎక్కువైతే సినిమా లీక్ చేస్తారా? టికెట్ రేట్స్ ఎక్కువైతే కంటెంట్‌ను దొంగిలించాలా? %డీవీజ% కాస్ట్ లీ అయితే షోరూం దోచుకుని మురికివాడలో అందరికీ ఉచితంగా కార్లు ఇవ్వాలి. నగలు కాస్ట్ లీ అయితే షాప్ దోచుకుని ఫ్రీగా అందరికీ ఇచ్చేయాలి. అన్నీ వస్తువులకు ఇదే లాజిక్ వర్తిస్తుంది.ఈ రకమైన ఆలోచన సామాజిక పతనం, అరాచకానికి దారితీస్తుంది. ప్రజలు పైరేటెడ్ కంటెంట్ తమ సౌలభ్యం కోసం చూస్తారు. పైరసీ కొంతమందికి డబ్బు ఆదా చేస్తే కొంతమందికి టైం ఆదా చేస్తుంది. నాతో సహా సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తులు కూడా ఇదే కారణంతో పైరసీ కంటెంట్ చూస్తారు. పైరసీ ఆపాలంటే చూసే వాళ్లను కూడా నిందితులుగా పరిగణించాలి. అలాంటి కంటెంట్ చూస్తున్న 100 మందిని అరెస్ట్ చేసి వారి పేర్లు ప్రచారం చేయాలి. ఇక్కడ భయం పనిచేస్తుంది. నైతికత పనిచేయదు.' అంటూ రాసుకొచ్చారు.

# బీఆర్ఎస్ ఎందుకు కుప్పకూలింది?

**హైదరాబాద్, నవంబర్ 22, పెన్ పవర్:** జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీఆర్ఎస్ ఎదుర్కొన్న ఓటమి%ొ% కేవలం పరాజయం కాదు. గత ఒక దశాబ్దంగా హైదరాబాద్‌లో పర్పుల్ రంగులో మెరుస్తూ వచ్చిన బీఆర్ఎస్‌కు ఇది పెద్ద రాజకీయ హెచ్చరిక. పార్టీ అంచనాలు, క్యాడర్ ఆశలు%ొ% ఏదీ నెరవేరలేదు. బీఆర్ఎస్ ఎందుకు గెల్చుకోలేకపోయింది? ఎక్కడ తప్పు జరిగింది?

జూబ్లీహిల్స్ ఫలితం బీఆర్ఎస్‌కు పెద్ద జోల్ట్. పార్టీ పాకేజీ కూడా లేకుండా, ప్రణాళిక దూరంగా ఉండగా, కాంగ్రెస్ మాత్రం వ్యూహాత్మకంగా ముందుకు సాగింది. కానీ ఈ ఓటమి ఒక్క కారణంతో రాలేదు. అందులో దాగి ఉన్న ఎన్నో లోతైన రాజకీయ పొరపాట్లు%ొ% నాయకత్వానికి అసలు తలనొప్పిగా మారాయి.

ప్రచారం మొత్తంలో కేసీఆర్ ఒక్క సభ కూడా చేయలేదు. క్యాడర్‌కు ఇది పెద్ద మైనస్. హరీష్ రావు దూరంగా ఉండాల్సి రావడం కూడా పరిస్థితిని మరింత సంక్లిష్టం చేసింది. పార్టీ పదేళ్లపాటు అధికారంలో ఉండి ఇంత తేలికగా వ్యవహరించిందన్న విమర్శలు వచ్చాయి. ప్రచారం సమయంలో ఎక్కడికక్కడ గ్రూపులు, వేర్వేరు నేతలు వేరు వేరు కార్యక్రమాల్లో ... బీఆర్ఎస్ నేతల్లో ప్రచారం సమయంలో కనిపించాల్సిన జోష్ కనిపించలేదు. అంతర్గత అసమ్మతి బాగా బయటపడింది. కొంతమంది నాయకులు కాంగ్రెస్ అభ్యర్థికి సహకరించారని వచ్చిన ఆరోపణలు క్యాడర్‌ను మరింత నిరుత్సాహపరిచాయి.

ఇది ఓటర్ల మైండ్‌సెట్‌లో నేరుగా ప్రభావం చూపింది. జూబ్లీహిల్స్‌లో ముస్లిం ఓటర్లు కీలకం... ఇది తెలియని




విషయం ఏం కాదు. అయితే ప్రచారం చూస్తే ఆ వర్గానికి అనుగుణంగా ప్రత్యేక కార్యక్రమాలు, ప్రతినిధులు, గ్రౌండ్ యాక్టివిటీ ఏది కనబడలేదు. ఫలితం... ఆ వర్గం మొత్తం కాంగ్రెస్ వైపు మొగ్గు చూపింది. ఉపఎన్నికల్లో డోర్-టు-డోర్ ప్రచారం అత్యంత కీలకం. కానీ బీఆర్ఎస్‌కు అనేక ప్రాంతాల్లో బూత్ స్థాయి నాయకులు కనిపించలేదు. ప్రచారం ఈజీగా, నిర్లిప్తంగా సాగింది. కొన్ని కాలనీల్లో ప్రచారం కనిపించలేదన్న వాస్తవం.. ఓటర్లను పార్టీ దూరం చేసింది. నియోజకవర్గ అభివృద్ధి గురించి చెప్పాల్సిన సమయంలో.. బీఆర్ఎస్ పూర్తిగా హైడ్రా కూల్చివేతల ప్రాపగాండాపైనే నడిచింది. ఇది నేరుగా ప్రజలకు ఎలాంటి సమస్య కలిగించిందన్న అంశం మాత్రం బలంగా కన్విన్స్ చేయలేదు. కేటీఆర్ ప్రసంగాలు కూడా డెవలప్మెంట్ కంటే రేవంత్ రెడ్డి పై అటాక్ మోడ్‌లోనే ఎక్కువగా కనిపించాయి. గోపీనాథ్ మరణం మిస్టరీలా కాంగ్రెస్ ప్రొజెక్ట్ చేయడంలో విజయవంతమైంది. సునీతపై దాడి చివరి రోజులలో మరింత పెరిగింది. ఈ కాంట్రవర్సీలను కౌంటర్ చేయడంలో బీఆర్ఎస్ పూర్తిగా విఫలమైంది. మహిళా ఓటర్లను ఇది బాగా ప్రభావితం చేసింది. కేటీఆర్ చివరి రెండు రోజుల వరకూ ప్రచారంలో యాక్టివ్‌గా కనిపించలేదు. ప్రచారం ఉన్నప్పుడు కూడా ఆయనలో కనిపించాల్సిన ఆత్మవిశ్వాసం, ధైర్యంఅవి పాక్షికంగా మాత్రమే కనిపించాయి. పార్టీని ఒంటరిగా మోసిన ఆయనపై ఈ ఓటమి ప్రభావం అత్యధికంగా పడే అవకాశం ఉంది.

ఎన్నికల్లో డబ్బు పంపిణీ కీలక పాత్ర పోషిస్తుందని అందరికీ తెలిసిందే. కానీ జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ పంచిందా? పంచలేదా?... ఈ అనుమానం ప్రజల్లో బలంగా వినిపించింది. ఈ గందరగోళం%ొ% సానుభూతి ఓటు కూడా కాంగ్రెస్ వైపు వెళ్లేలా చేసింది. మొత్తం మీద %-% ఇది ఒక్క ఉపఎన్నిక కాదు, బీఆర్ఎస్‌కు రెడ్ అలర్ట్. ఈ చిన్న ఎన్నిక%ొ% పెద్ద రాజకీయ సంకేతాలను ఇచ్చింది. పార్టీ బలం ఎక్కడ ఉంది? బలహీనత ఎక్కడ బయల్పడింది? ఏ నాయకులపై ప్రజలు నమ్మకం కోల్పోయారు? ఈ ప్రశ్నలకు సమాధానం అన్వేషించకపోతే%ొ% బీఆర్ఎస్‌కు రాబోయే రోజులు మరింత క్లిష్టమయ్యే అవకాశముంది.

జూబ్లీహిల్స్ పరాజయం%ొ% బీఆర్ఎస్‌కు సైలెంట్‌గా అనిపించినా%ొ% రాజకీయంగా పెద్ద ప్రమాద సంకేతమని విశ్లేషకులు చెబుతున్నారు. పార్టీ వ్యూహం, నాయకత్వం, ప్రచార పద్ధతిపై సమగ్ర సమీక్ష అవసరం ఉందనే అభిప్రాయం బలపడుతోంది.

# ఐబొమ్మ రవి దమ్మున్నోడు.. దమ్ముంటే సైబర్ నేరాలు ఆపండి: సజ్జనార్‌కు తీన్మార్ మల్లన్న సవాల్

- **ఐబొమ్మ రవి అరెస్టు వ్యవహారానికి రాజకీయ రంగు**
- **సీపీ సజ్జనార్‌ను లక్ష్యంగా చేసుకుని తీన్మార్ మల్లన్న తీవ్ర వ్యాఖ్యలు**
- **రవి దమ్మున్నోడని, సజ్జనార్‌వి ఫేక్ ఎన్‌కౌంటర్లు అని ఆరోపణ**
- **మల్లన్న వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు**



**హైదరాబాద్ పెన్ పవర్:** పైరసీ వెబ్‌సైట్ 'ఐబొమ్మ' నిర్వాహకుడు ఇమంది రవి అరెస్ట్ వ్యవహారం అనూహ్యంగా రాజకీయ మలుపు తీసుకుంది. ఈ అరెస్టుపై కాంగ్రెస్ బహిష్కృత నేత తీన్మార్ మల్లన్న చేసిన సంచలన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్‌ను లక్ష్యంగా చేసుకుని ఆయన చేసిన తీవ్ర ఆరోపణలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఐబొమ్మ రవి దమ్మున్నవాడని, అందుకే అతనికి ప్రజల మద్దతు ఉందని తీన్మార్ మల్లన్న అన్నారు. "వంద రూపాయల టికెట్‌ను వేలల్లో అమ్ముకునే సినిమా వాళ్లు ఏమైనా సంసారులా?" అని ప్రశ్నించారు. సినిమా ప్రముఖులతో కలిసి సజ్జనార్ మీడియా సమావేశం నిర్వహించడంపై మండిపడ్డారు. రవి భార్య సమాచారం ఇవ్వకుంటే పోలీసులు అతడిని పట్టుకునేవారే కాదని, సినిమా డైలాగులు చెప్పడం మానుకోవాలని హితవు పలికారు. సజ్జనార్ చేసేవన్నీ ఫేక్ ఎన్‌కౌంటర్లేనని, వరంగల్‌లో చేసింది కూడా అదేనని మల్లన్న తీవ్ర ఆరోపణలు చేశారు. "నీకు దమ్ముంటే దేశంలో జరుగుతున్న సైబర్ క్రైమ్‌లు, కిడ్నాప్‌లు, ఆర్థిక నేరాలను ఆపి చూపించు" అంటూ సవాల్ విసిరారు. గతంలో సీవీ ఆనంద్ కూడా ఇలాంటి సైబర్ మోసాలు ఆగవని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు.

గత కొంతకాలంగా సినీ పరిశ్రమకు తలనొప్పిగా మారిన ఐబొమ్మ నిర్వాహకుడి అరెస్టుతో ఇండస్ట్రీ వర్గాలు ఊపిరిపీల్చుకున్నాయి. అయితే అధిక టికెట్ ధరల కారణంగా థియేటర్లకు వెళ్లలేని సామాన్యులు మాత్రం రవికి మద్దతు తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలోనే మల్లన్న వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. అయితే, ఆయన వ్యాఖ్యలపై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. కొందరు సమర్థిస్తుండగా, మరికొందరు పోలీసు శాఖను అగౌరవపరిచారంటూ మండిపడుతున్నారు. మల్లన్నపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# చింతల్ బజార్ లో ఎమ్మెల్యే శ్రీగణేష్ పర్యటన

**హైదరాబాద్ పెన్ పవర్:**కంటోన్మెంట్ నియోజక వర్గ సమగ్రాభివృద్దే లక్ష్యంగా కాలనీల పర్యటన లో ఎమ్మెల్యే శ్రీగణేష్ నేడు బొల్లారం (వార్డు 8) లోని చింతల్ బజార్ వివేకానంద వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీ,స్నేహ కాలనీలలో కాలనీ వాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు .ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని డ్రైనేజీ, అంతర్గత రహదారులు, పార్కులను అభివృద్ధి చేయవలసిన ఆవశ్యకతను ఈ సందర్భంగా కాలనీలవాసులు ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే శ్రీ గణేష్ కాలనీలలో క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను స్వయంగా పరిశీలించారు. ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థ, అంతర్గత రహదారులను ఎన్నో ఏళ్ల నుంచి పట్టించుకోకపో ోవడంతో పెరిగిన జనాభాకు అనుగుణంగా వాటిని అభివృద్ధి చేయకపోవడంతో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని, వాటిని మార్చవలసిన అవసరం ఉందని చెప్పారు. స్నేహ కాలనీలోని పార్కును నియోజకవర్గంలో మోడల్ పార్కుగా అభివృద్ధి చేస్తానని,పార్కులో వాకింగ్ ట్రాక్, బాస్కెట్ బాల్ కోర్ట్, యోగా సెంటర్ ఏర్పాటు చేస్తానని, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసమే కాలనీల పర్యటన చేపట్టానని కాలనీలలో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని, సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గానికి అభివృద్ధి కోసం ఎన్ని నిధులైన ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని, ఆ నిధులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. తమ అవసరాలను గుర్తించి త్వరితగతిన వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామినివ్వడంతో కాలనీల వాసులు ఎమ్మెల్యే శ్రీగణేష్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.

# కోల్ ఇండియా - రెయిన్బో చిల్డ్రన్స్ హాస్పిటల్ అవగాహన ఒప్పందం:

**హైదరాబాద్ పెన్ పవర్:**తలసీమియా వ్యాధితో బాధపడుతున్న పిల్లలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కోల్ ఇండియా లిమిటెడ్ కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి ఆధ్వర్యంలో మహారత్న సంస్థగా ఉన్న కోల్ ఇండియా, తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (%జూ=%) లో భాగంగా రెయిన్బో చిల్డ్రన్స్ ఫౌండేషన్తో శనివారం ముఖ్యమైన అవగాహన ఒప్పందం (%వీశీఖ%) కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం, తలసీమియా బాధిత చిన్నారులకు అవసరమైన బోన్ మేరో ట్రాన్స్ప్లాంట్ (%దీమీ%) చికిత్స కోసం కోల్ ఇండియా ప్రతి బిడ్డకు ?10 లక్షల ఆర్థిక సాయం అందించనుంది.

దేశవ్యాప్తంగా సేవల విస్తరణ

హైదరాబాద్లో రెయిన్బో చిల్డ్రన్స్ హాస్పిటల్ లో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ సహా కొన్ని రాష్ట్రాల్లో లేని అధునాతన శస్త్రచికిత్స సౌకర్యాలను ఇతర రాష్ట్రాలకు కూడా విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆదేశించినట్లు వెల్లడించారు.

ఆయుష్మాన్ భారత్ ప్రగతి

ఇప్పటివరకు 42 కోట్ల మంది ప్రజలు ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా లబ్ది పొందారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ?1.75 లక్షల కోట్ల విలువైన ఉచిత వైద్య సేవలను ప్రజలకు అందించింది. టీబీ లేని భారతదేశం లక్ష్యంగా భారీ ఆరోగ్య కార్యక్రమాలు అమల్లో ఉన్నాయి. ప్రతి జిల్లాలో ఒక మెడికల్ కాలేజ్ ఏర్పాటు చేయడం, మెడికల్ సీట్ల సంఖ్య పెంచడం వంటి సంస్కరణలు ఆరోగ్య రంగంలో వేగంగా జరుగుతున్నాయి.

భవిష్యత్తు లక్ష్యం: అభివృద్ధి చెందిన భారత్

"2047 నాటికి భారత్ను అభివృద్ధి చెందిన దేశంగా నిలపడం ప్రధాని మోడీ లక్ష్యం. వైద్యం, విద్య, ఉపాధి, తయారీ, సేవల రంగం, రక్షణ, అంతరిక్షం, ఐటీ ఎ అన్ని రంగాల్లో భారత్ ప్రపంచ స్థాయిలో ముందుకెళ్లాలి" అని పేర్కొన్నారు.

# పది సంవత్సరాల కాలంలో బిఆర్ఎస్ ప్రభుత్వం 2.80 లక్షల కోట్ల అప్పులు

- **23 నెలల కాలంలో కాంగ్రెస్ పార్టీ రెండు లక్షల 30 వేల కోట్ల అప్పులు**
- **అప్పులన్నీ ఎవరి జేబుల్లోకి పోతున్నాయో ప్రజలకు చెప్పాలి:కెటిఆర్**



**హైదరాబాద్ పెన్ పవర్:**

బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అప్పుల మధ్య ఉన్న తేడాను కెటిఆర్ వివరించారు. గత ప్రభుత్వం తీసుకు వచ్చిన ప్రతి పైసా ద్వారా ఆస్తులను సృష్టిస్తే ఈ ప్రభుత్వం మాత్రం అప్పుల సునామిని సృష్టించి రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభం వైపు నడిపిస్తుందని మండిపడ్డారు. పార్లమెంట్ లెక్కల ప్రకారం పది సంవత్సరాల కాలంలో బిఆర్ఎస్ ప్రభుత్వం కేవలం 2.80 లక్షల కోట్ల అప్పులు తీసుకువస్తే, 23 నెలల కాలంలోనే దాదాపు రెండు లక్షల 30 వేల కోట్ల అప్పులను కాంగ్రెస్ పార్టీ తీసుకువచ్చిందని అన్నారు.ఆనాడు మిషన్ భగీరథ, కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి మిషన్ కాకతీయ వేలకోట్ల రూపాయలతో రహదారుల నిర్మాణం వంటి అనేక ఉత్పాదక ఆస్తులను సృష్టించిందని తెలిపారు. కానీ ఈ ప్రభుత్వం ఎలాంటి కొత్త పథకం లేకుండానే, ఒక్క ప్రాజెక్టు ప్రారంభం కూడా చేయకుండానే, కనీసం మౌలిక వసతుల కోసం ఒక్క ఇటుక పేర్చకుండానే రెండు లక్షల 30 వేల కోట్ల రూపాయల అప్పులు తీసుకువచ్చి ఏం చేసిందని ప్రశ్నించారు. అక్టోబర్ నెల కోసం విడుదల చేసిన కాగ్ నివేదికతో వడ్డీల వాదనలో డొల్లతనం బయటపడటంతో, ఇంత భారీ మొత్తంలో చేస్తున్న అప్పులన్నీ ఎవరి జేబుల్లోకి పోతున్నాయో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. వడ్డీల పేరుతో పదేపదే అబద్ధాలు చెబుతూ ప్రజల దృష్టిని మళ్లిస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం, వాస్తవానికి ఈ అప్పులన్నింటినీ తమ అనుచరులు, మధ్యవర్తులు, ఢిల్లీకి మూటలను పంపడానికే ఉపయోగిస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని 'స్కాంగ్రెస్ ఎటిఎం' గా మార్చారని విమర్శించారు. ఇన్ని రోజులు వడ్డీల కోసమే అప్పులు చేస్తున్నామని కాంగ్రెస్ వాళ్ళు చెప్పుకొచ్చినా, కాగ్ నివేదికతో మరోసారి వాదనలోని డొల్లతనం బట్టబయలైనందున, ఈ అప్పులన్నీ దేని కోసం చేశారో వెంటనే ప్రజలకు వివరించాలని అన్నారు.

# ఆరంఘర్ లో ఫూట్ పాట్ ఆక్రమణల కూల్చివేత

**హైదరాబాద్ పెన్ పవర్:**

రాజేంద్రనగర్ సర్కిల్ ఆరంఘర్ చౌరస్తా, పిల్లర్ నెంబర్ 294 వద్ద ఫుట్పాత్ రోడ్డు ఆక్రమణలపై రాజేంద్రనగర్ డి.సి సురేందర్ రెడ్డి ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీధర్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు. కొందరు వీధి వ్యాపారులు జీహెచ్ఎంసి అధికారులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. సంఘటన స్థలంలోనే ఉన్న పోలీసులు ఆందోళనకారులను చేదరగొట్టారు. ఫూట్ పాత లను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు..

# భూములను అక్రమంగా రిజిస్ట్రేసన్ చేసుకున్నారు

**హైదరాబాద్ పెన్ పవర్:**వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల అంతారం రైతులు మాడిగేషన్ పేరుతో భూములు కజెషనా వ్యక్తులపై చర్య తీసుకోవాలని తెలంగాణ డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసారు.


అక్రమంగా తమ భూములు కాజేసిన రియల్ ఎస్టేట్ బ్రోకర్ల చెర నుండి తమను కాపాడాలని,.మా భూములు మాకు ఇప్పించాలంటూ భూములు మాకు రిజిస్ట్రేషన్ చేయకపోతే చావే శరణ్యమంటున్నన్నారు.

తమ భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై చట్ట రిత్యా చర్యలు తీసుకోవాలని రైతుల డిమాండ్ చేశారు.మార్టిగేజ్ పేరుతో 2024 నవంబర్ లో రైతుల నుండి భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న బ్రోకర్లు,మార్టిగేజ్ చేసిన డబ్బులు ఇవ్వమంటే మొహం చాటేసారని రైతులు తెలిపారు.ఈ క్రమంలో తాము చేసింది మార్టిగేజ్ కాదని... తమను మాయ మాటలతో మోసం చేసిన చెల్లని చెక్కులు ఇచ్చి సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టు ఆలస్యంగా తెలుసుకున్నామని రైతులు వాపోయారు.రంగారెడ్డి జిల్లాకు చెందిన , నిఖిల్ రెడ్డి రామ్ నాయక్ మనోజ్ అనే వ్యక్తులు మార్టిగేజ్ చేసుకొని డబ్బులు ఇస్తామని మోసం చేసి దేవి రెడ్డి రత్నమ్మ పేరిట సేల్ డీడ్ చేశారని కుల్కచర్ల తహశీల్దార్ కు,పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు చేసిన ఆరు నెలలకు అసలు నిందులను కాకుండా మధ్యవర్తులను పోలీసులు రిమాండ్ చేశారంటూ రైతుల ఆరోపణ చేశారని....తమ పై రాజకీయ ఒత్తిడి ఉందని పోలీసులు చేతులెత్తేస్తున్నారని షాద్నగర్ పట్టణం చెందిన మహిపాల్ రెడ్డి తెలంగాణ డిజిపి మాకు తెలుసు వాళ్ళు ఉన్నారని మీరు ఏమి చేయగలరని బెదిరిస్తున్నారు అదే విషయం డిజి గారికి దృష్టిలో వేయాలని మాకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేయడానికి వచ్చానురైతులు .అసలు నిందితులను పట్టుకొని తమ భూమి తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయించాలని కోరుతున్నారు.

# ప్రభుత్వానికి పద్మశాలి సంఘం ధన్యవాదాలు

**హైదరాబాద్ పెన్ పవర్:**చేనేత రుణమాఫీని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడం పట్ల తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ధన్యవాదాలు తెలిపింది. హైదరాబాద్ నారాయణగూడ లోని పద్మశాలి భవన్ లో రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటలకు పాలాభిషేకం చేశారు. రైతు రుణమాఫీ తరహాలో చేనేత రుణమాఫీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిందని పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి అన్నారు. ఒక్కొక్క చేనేత కార్మికుడికి లక్ష చొప్పున 33 కోట్లు రుణమాఫీ చేసిందని పేర్కొన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పద్మశాలీలు నిర్లక్ష్యానికి గురయ్యారని , కాంగ్రెస్ ప్రభుత్వంలో చేయూత లభిస్తుందన్నారు. ఇందిరమ్మ జయంతి సందర్భంగా కోటి చేనేత చీరలను పద్మశాలీలు తయారు చేసే అవకాశం కల్పించారన్నారు. పద్మశాలీల సంక్షేమానికి కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తాము అండగా ఉంటామని మురళి తెలిపారు.

## తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్ ను ఆకస్మిక తనిఖీ




**రాజన్న సిరిసిల్ల పెన్ పవర్:**శనివారం రోజు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత. తెలంగాణ డయాగ్న స్టికె సెంటర్ ను, తంగళ్ళపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రమును ఆకస్మికంగా తనిఖీ చేశారు తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్లలో నిర్వహించే రక్త నమోనా పరీక్షలను, రిజిస్టర్ ను పరిశీలించి సరియైన రిపోర్టులు అందించి ప్రజల వ్యాధులను అరికట్టులలో జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు. తంగళ్ళపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించే వ్యాధి నిరోధక టీకాల రిజిస్టర్లను పరిశీలించి, చిన్నపిల్లల తల్లిదండ్రులకు వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించి పిల్లలకు సకాలంలో టీకాలు తీసుకొని వ్యాధి నిరోధక శక్తిని పెంపొందింప చేయవలసిందిగా మండల వైద్యాధికారి డాక్టర్ స్నేహ తొ పాటు వైద్య సిబ్బందికి సూచించారు

## బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల

**హైదరాబాద్ పెన్ పవర్:**రఘునాథపాలెం మండలం శివాయి గూడెం నుంచి మంచుకొండ వరకు బీటీ రోడ్డుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేసారు.మంత్రి తుమ్మల మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం తరపున పుట్టింటి సారే మాదిరి ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసారు. ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పన ప్రభుత్వం బాధ్యత . ప్రతి ఇల్లు శుభ్రంగా ఉన్నట్లే ప్రతి ఊరు శుభ్రంగా ఉండాలి. ఊరు శుభ్రంగా ఉంటేనే ప్రజారోగ్యం బాగుంటుంది. చీడ పీడలు లేకుండా కోతుల బెడద లేకుండా పామాయిల్ సాగు చేపట్టాలి. పామాయిల్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం వుంటుంది. పండుగలా గ్రామాల్లో చీరలు పంపిణీ చేస్తున్నామని అన్నారు.ద

## ప్రభుత్వానికి వ్యతిరేకంగా 42 % రిజర్వేన్ సాధన సమితి అందోళన

**హైదరాబాద్ పెన్ పవర్:**42%రిజర్వేషన్స్ సాధన సమితి శనివారం నాడు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గన్ పార్క్ వద్ద ఆందోళన చేపట్టింది. చట్టబద్ధతతో కూడిన 42శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తరువాతనే పంచాయితీ ఎన్నికలు నిర్వహించాలని నిరసనకు దిగింది. కాగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారమే మేము అడుగుతున్నాం. కాంగ్రెస్, బిజెపి బిసిల పట్ల కుట్రలు చేస్తూ. స్థానిక ఎన్నికలలోకి వెళ్తున్నారు. పార్టీ పరంగా కాకుండా చట్టబద్ధంగా రిజర్వేషన్లు ఇవ్వాలి. స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా వేసుకోవాలి లేదంటే బిసిల ఆగ్రహానికి గురి కాకా తప్పదు. నయవంచన చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి బిసిలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో గీతాపనివారల రాష్ట్ర సదస్సు




**హైదరాబాద్ పెన్ పవర్::**ఈ కార్యక్రమంలో పాల్గొన్న గీతా పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ గౌడ్, పల్లె లక్ష్మణ్ రావు గౌడ్ ఎస్టి యు అధ్యక్షుడు సదానందం గౌడ్, పల్లా వెంకటే, వివిధ జిల్లాల గీతపనివారల సంఘం నేతలు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.

నేను మీ బిడ్డను సర్వాయి పాపన్న వారసుడిని ఎల్లమ్మ తల్లి బిడ్డను.సంఘ సమస్యల పరిష్కారం కోసం అండగా ఉంటారాజకీయాల్లో ప్రభుత్వం పక్షాన వృత్తిపరంగా కుల సమస్యలు పరిష్కారం చేయడానికి ముందుకు తీసుకుపోతా.

వృత్తి బతకాలంటే తాటి ఈత మొక్కలు పెట్టాలి. ప్రభుత్వం తరుపున 45 లక్షల ఈత తాటి మొక్కలు పెట్టాం.ప్రభుత్వం మొక్కలు ఇవ్వడానికి సిద్ధంగా ఉంది గుంత తవ్వి రక్షించే వరకు బాధ్యత ప్రభుత్వంది. ఈ మధ్య చేసిన కుల సర్వే లో ఉన్నత స్థానాలకు ఎదిగిన వారిని చూస్తే ఉన్నత విద్యను అభ్యసించిన కుటుంబాలే మంచి స్థాయిలో ఉన్నాయి మనం తిన్నా తినకున్నా మన పిల్లలను మంచి చదువులు అందించాలి.

ఎక్స్ గ్రేషియా, కాటమయ్య రక్షణ కవచాలు పంపిణీ,గీతా సమస్యల పరిష్కారం అన్నిటికి ప్రభుత్వం నుండి అండగా ఉంటా

మనం ఐక్యంగా ఉండి సమస్యలు పరిష్కారం చేసుకోవాలి.ధర్మ భిక్షం అంటే నాకు గౌరవం ఆయన ఆశయాలకు కొనసాగిస్తాం.

నేను, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కలిసి ట్యాంక్ బండ్ పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటుకు శంకుస్థాపన చేసుకున్నాం.

ఊర్లలో మనం మన తాకత్ పెంచుకోవాలి. .అందరిని ఐక్యంగా కలుపుగోలుగా ఉన్నప్పుడే సాధ్యం అవుతుంది ఎవరికి కించపరచద్దు అప్పుడే ఊర్లలో నాయకత్వం పెరుగుతుంది.

వృతి పరంగా ఏ సమస్య వచ్చిన ప్రభుత్వం లో నా గొంతు కోట్లాడుతుంది.ఎక్స్ గ్రేషియా విడు దల ఈత తాటి మొక్కల పెంపకం,కాటమయ్య రక్షణ కవచాలు పంపిణీ అన్ని ప్రభుత్వం నుండి అమలయ్యేలా చూస్తాం.

# సీతాఫల్ మండిలో ఐక్యతా పరుగు

**హైదరాబాద్ పెన్ పవర్:**

సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఐక్యత పరుగు నిర్వహించనున్నట్లు మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్ తెలిపారు.ఆదివారం ఉదయం సీతాఫల్మండిలోని శివాజీ విగ్రహం నుండి చిలకలగూడ గాంధీ విగ్రహం వరకు వెయ్యి మందితో ఐక్యత పరుగు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు మహంకాళి జిల్లా బీజేపీ శ్రేణులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ జాతీయ భావాన్ని పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని,యువత ఈ ర్యాలీలో పాల్గొని జాతీయ స్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఉక్కు మనిషిగా భారతదేశాన్ని గొప్పగా తీర్చిదిద్దిన నాయకుడిగా చరిత్రలో నిలిచిపోయారని అన్నారు.

నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి కుష్బూ గుప్త మాట్లాడుతూ ఐక్యత పరుగులో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతికి చేసిన సేవలను స్మరించుకోవాలని ఆమె కోరారు. దశలవారీగా సికింద్రాబాద్ పార్లమెంటులోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో ఈ ర్యాలీ చేపట్టనున్నట్లు వెల్లడించారు.

# రాష్ట్రంలో సంక్షేమ పథకాలకు అవుతున్న ఖర్చు కంటే కెసిఆర్ చేసిన బాకీకి కడుతున్న వడ్డీ ఎక్కువ

**హైదరాబాద్ పెన్ పవర్:**

రాష్ట్రంలో సంక్షేమ పథకాలకు అవుతున్న ఖర్చు కంటే కెసిఆర్ చేసిన బాకీకి కడుతున్న వడ్డీ ఎక్కువగా ఉందని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన శనివారం ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని పంచుకున్నారు. కెసిఆర్ ప్రభుత్వం మితిమీరి చేసిన అప్పుల వల్లే ఇప్పుడు హామీల అమల్లో కొంత జాప్యం జరుగుతోందని ఆయన స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలోని ముఖ్యమంత్రులందరూ చేసిన అప్పు కంటే పదింతల అప్పులు చేసి రాష్ట్రాన్ని కెసిఆర్ అంధకారంలోకి నెట్టేశారని మంత్రి జూపల్లి ఆరోపించారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా తాము ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా అమలు చేస్తున్నామని ఆయన



తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా తమ ప్రభుత్వం మహిళలకు ఇస్తున్న చీరలు గతంలో ఇందిరమ్మ కట్టిన చీరల్లాగే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. నాణ్యతలో రాజీపడకుండా ప్రభుత్వం చీరలు తయారు చేయించిందన్నారు. మహిళా సంఘాల్లో లేని మహిళలకు సైతం చీరలు అందుతాయని, కొల్లాపూర్‌లో సరిగ్గా రోడ్లు కూడా లేవని గతంలో చంద్రబాబు నాయుడు హేళన చేశారని మంత్రి జూపల్లి పేర్కొన్నారు. తాను ఎమ్మెల్యేగా కిరణ్‌కుమార్ రెడ్డిని పట్టుబట్టి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేయించామని ఆయన పేర్కొన్నారు.

# ప్రజల భయం, అత్యాశే సైబర్ నేరగాళ్ల పెట్టుబడి

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రజల భయం, అత్యాశే సైబర్ నేరగాళ్లకు పెట్టుబడిగా మారుతోందని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్, అన్నారు. సైబర్ నేరాల విషయంలో ప్రతి ఒక్కరికి అప్రమత్తత అవసరమని ఆయన సూచించారు.

హైదరాబాద్ చార్మినార్ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన 'జాగృత్ హైదరాబాద్-సురక్షిత్ హైదరాబాద్' సైబర్ నేరాల అవగాహన కార్యక్రమానికి నగర సీపీ శ్రీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోలీస్ అధికారులతో కలిసి చార్మినార్ పరిసరాల్లో సైబర్ క్రైం నివారణ కరపత్రాలను ఆయన పంపిణీ చేశారు. అనంతరం చార్మినార్ నుంచి మదీనా వరకు తలపెట్టిన సైబర్ క్రైం అవగాహణ ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారితో సైబర్ ప్రతిజ్ఞ చేయించారు.




ఈ అవగాహన కార్యక్రమంలో సీపీ శ్రీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ మాట్లాడుతూ.. హైదరాబాద్ను సైబర్ నేరరహితంగా మార్చాలనే ఉద్దేశంతో ప్రతి మంగళ, శనివారాల్లో 'జాగృత్ హైదరాబాద్-సురక్షిత్ హైదరాబాద్' సైబర్ నేరాల అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా వారంలో ఈ రెండు రోజులు ప్రతి ఇంటికి పోలీస్ అధికారులు వెళ్లి అవగాహన కల్పిస్తున్నారని ఆయన వివరించారు.

అవగాహన లేమితోనే అనేక మంది సైబర్ నేరాల బాధితులవుతున్నారని అన్నారు. ఏ రకమైన సైబర్ మోసం అయినా, వాటికి అడ్డుకట్ట వేయాలంటే ప్రజలకు స్వీయ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు.

సైబర్ నేరాల నివారణకు ప్రజలను భాగస్వామ్యం చేస్తున్నామని, స్వచ్ఛందంగా వలంటీర్లుగా ముందుకు వచ్చే వారు సైబర్ సింబాలుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఇంట్లో ఒక సైబర్ సింబా తయారై తన కుటుంబాన్ని, సమాజాన్ని సైబర్ మోసాల నుంచి రక్షించాలని పిలుపునిచ్చారు.

ప్రైవేట్ ఫోటోలు, వ్యక్తిగత వివరాలను సోషల్ మీడియాలో అప్లోడ్ చేయవద్దని, అలా చేస్తే ట్రాప్ చేసి మోసం చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. పిల్లలు సోషల్ మీడియాకు అడిక్ట్ అవుతున్నారని, ముఖ్యంగా ఆడపిల్లలు అజ్ఞాత వ్యక్తులతో చాటింగ్ చేసి వ్యక్తిగత వివరాలు సమర్పించుకొని బాధితులు అవుతున్నారని చెప్పారు.

ఆడ పిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని, వారికి ఫోన్లు ఇచ్చే ముందు జాగ్రత్తలు చెప్పాలని సూచించారు. సీనియర్ సిటిజన్లను లక్ష్యంగా చేసుకుంటున్న 'డిజిటల్ అరెస్ట్' మోసాల పట్ల వారి పిల్లలు అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఒకవేళ సైబర్ మోసానికి గురైతే ఏమాత్రం ఆలస్యం చేయకుండా హెల్ప్ లైన్ నంబర్ 1930 కి చేసి సమాచారం ఇవ్వాలని అన్నారు. అలాగే, జాతీయ సైబర్ పోర్టల్ %షషష.ఎఎవతీఎతీఅఎవ.స్త్రశీజ.ఱఅ% లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

సైబర్ నేరాల్లో గోల్డెన్ అవర్ చాలా కీలకమని, మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న డబ్బును తిరిగి రాబట్టవచ్చని స్పష్టం చేశారు. అనుమానాస్పద కాల్స్, లింక్స్, యాప్ లను నమ్మవద్దని, ఓటీపీలు, పాస్వర్డ్లు, బ్యాంక్ వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దన్నారు.

ఈ కార్యక్రమములో అడిషినల్ సిపి క్రైం ఆండ్ సిట్ శ్రీ.యం.శ్రీనివాస్ ఐపిఎస్, సౌత్ జోన్ అడిషినల్ డిసిపి శ్రీ.యం. మాజిద్, సౌత్ జోన్ ఏసీపీలు పి.చంద్రశేఖర్, సీహెచ్.చంద్రశేఖర్, జి.శ్యామ్ సుందర్, ఎంఏ జావీద్, తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# హిమ వీరులారా మీ త్యాగాలు వెలకట్టలేనివి.!

**హైదరాబాద్ పెన్ పవర్:**
జమ్మూలోని ఉదంపూర్ లో ఘనంగా ఐటీబీపీ పరేడ్ దినోత్సవాలు..ఐటీబీపీ అమరవీరులకు ఘన నివాళి అర్పించిన కేంద్ర మంత్రి.
విజేతలకు ట్రోఫీ, మెడల్స్ ను అందజేసిన బండి సంజయ్.

మంచు పర్వతాల్లో,ప్రతికూల వాతావరణ పరిస్థితుల మధ్య ఇండో టిబెటన్ బోర్డర్ పోలీసులు దేశానికి చేస్తున్న సేవలు, త్యాగాలు వెలకట్టలేనివని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. 3488 కి.మీల పొడవైన భారత్-చైనా సరిహద్దు రక్షణలో ఐటీబీపీ సిబ్బంది సేవలు అమోఘమని అభివర్ణించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజల రక్షణ కోసం సహాయ చర్యలు అందిస్తూ ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారని కొనియాడారు. దీంతోపాటు సివిక్ యాక్షన్ ప్రోగ్రామ్, కింద స్థానిక ప్రజలకు స్వయం ఉపాధి శిక్షణనివ్వడం భేష్ అని అభినందించారు. పర్వతారోహణసహా అడ్వెంచర్ స్పోర్ట్స్ లోనూ ఐటీబీపీ అద్భుతమైన ప్రతిభను కనబరుస్తున్నారని చెప్పారు.



ఐటీబీపీ 64వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని జమ్మూకాశ్మీర్ లోని ఉధంపూర్ 15వ ఐటీబీపీ బెటాలియన్ కేంద్రంలో నిర్వహించిన పరేడ్ కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి జమ్మూకాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ఐటీబీపీ డీజీ ప్రవీణ్ కుమార్ తోపాటు పలువురు ఐజీలు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి ఐటీబీపీ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. నేరుగా ఐటీబీపీ అమరవీరుల స్మారక స్థలికి వెళ్లిన కేంద్ర మంత్రి విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఐటీబీపీ సిబ్బందికి ఘన నివాళి అర్పించారు. నూతనంగా నిర్మించిన ఐటీబీపీ భవనాలకు, బ్యారక్ లను రిమోట్ ద్వారా ప్రారంభించారు.

అనంతరం ఐటీబీపీ పరేడ్ కార్యక్రమానికి హాజరైన బండి సంజయ్ కీలకోపన్యాసం చేశారు.

ప్రధాని మోదీ నేతృత్వంలో హోంమంత్రి అమిత్ షా మార్గదర్శనంలో హోంశాఖ ఐటిబిపి సహా అన్ని సీఏపీఎఫ్ కేంద్రీయ సాయుధ పోలీస్ దళాలు, మరింత బలోపేతం కోసం ఆధునిక ఆయుధాలు, పరికరాలు, సౌకర్యాలతో సమృద్ధిగా తయారు చేసేందుకు నిరంతరం క్రుషి చేస్తున్నాం. ఐటీబీపీ సిబ్బంది ఎదుర్కొనే ప్రతి సమస్యకు తగిన, సమయానుకూల పరిష్కారం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇస్తున్నాను.

## మావోయిస్టు పార్టీకి మరో షాక్

**హైదరాబాద్ పెన్ పవర్:** మావోయిస్టు పార్టీకీ మరో భారీ షాక్ తగిలింది. తెలంగాణ డీజీపీ శివధర్రెడ్డి ఎదుట 37 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వారంతా భారీగా ఆయుధాలు అప్పగించారు. 303 రైఫిల్స్, జీ3 రైఫిల్స్, ఏకే 47లు, ఎస్ఎల్ఆర్, భారీగా బుల్లెట్స్ అప్పగించారు. లొంగిపోయిన వారిలో 25 మంది మహిళా మావోయిస్టులు వున్నారు. లొంగిపోయిన వారిలో మావోయిస్టు పార్టీ అగ్రనేత ఆజాద్, అప్పాసీ, నారాయణ, ఎర్రాలు వున్నారు. కోయ సాంబయ్య అలియాస్ ఆజాద్ 31 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్నాడని డీజీపీ శివధర్రెడ్డి అన్నారు.

## జిల్లా ఎస్పీగా స్నేహ మెహ్రా




**హైదరాబాద్ పెన్ పవర్:** ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ స్నేహ మెహ్రా వికారాబాద్ జిల్లా ఎస్పీగా స్నేహ మెహ్రా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్పీగా విధులు నిర్వహించిన ఎస్పీ నారాయణ రాచకొండ కు బదిలీపై వెళ్లగా శనివారం స్నేహమెహ్రా బాధ్యతలు చేపట్టారు. మధ్యాహ్నం ఎస్పీ కార్యాలయానికి చేరుకున్న ఎస్పీకి పోలీసులు ఆహ్వానించి పోలీస్ గౌరవ వందనం సమర్పించారు. ఎస్పీ చాంబర్ లో ఎస్పీ నారాయణ రెడ్డి స్నేహమెహ్రాకు బాధ్యతలు అప్పగించారు.
తరువాత మీడియా తో మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలో ఎలాంటి సమస్యలు ఉన్నాయో తెలుసుకుని వాటిని పరిష్కారం చేసే విధంగా చర్యలు తీసుకుంటా వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా తెలిపారు.

## గజ్వేల్ లో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ ...పాల్గొన్న మంత్రి వివేక్

**హైదరాబాద్ పెన్ పవర్:** జిల్లా ఇంచార్జ్ మంత్రి జి.వివేక్ వెంకట స్వామి, గజ్వేల్ ఐఓసి లో మహిళలకు ఇందిరా మహిళ శక్తి చీరల పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి, ఎం ఎల్ సి యాదవ రెడ్డి, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, ఆర్డీవో చంద్రకళ, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, నియోజక వర్గంలో పలు మండలాల మార్కెట్ కమిటీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు. జ్యోతి ప్రచోదన చేసి తెలంగాణ గేయాలపన తరవాత జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి జయదేవ్ ఆర్య ఇందిరా మహిళ శక్తి చీరల పంపిణీ కార్యక్రమం విశిష్టత మహిళ శక్తి ద్వారా మహిళలు చేస్తున్న కార్యక్రమాలు గూర్చి వివరించారు. గజ్వేల్ నియోజకవర్గంలో 54000 చీరలు పంపిణీ చేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ తెలంగాణ గీతాలాపన సమయంలో చాలా మంది మహిళలు గేయాన్ని ఆలపించడం జరిగిందని రాష్ట్ర గీతానికున్న ప్రాముఖ్యతనీ తెలియజేస్తుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి మహిళా అభ్యున్నతికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ మహిళలను అన్ని రంగాల్లో బలోపేతం చేయడానికి మహిళా శక్తి పెంచడానికి వారే స్వంతంగా ఆదాయం సంపాదించడం కోసం కుటుంబానికి పోషించడం కోసం అనేక పథకాలు చేపట్టారు.
స్కూల్ యూనిఫాం, 28 కోట్ల వడ్డీలేని రుణాలు, బ్యాంక్ లింకేజీ కార్యక్రమంలో 600 కోట్ల రూపాయలు బ్యాంక్ లింకేజీ కూడా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది. ఉచిత బస్సు కోసం 8 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. ఈ పథకాన్ని చాలా మంది మహిళలు ఉపయోగించుకుంటున్నారు. రేషన్ సన్నబియ్యం పంపిణీ 12వేల కోట్ల రూపాయలు ప్రభుత్వం ఖర్చు చేస్తుంది. మా ప్రభుత్వం వచ్చినా తరవాత మహిళలకు ఇష్టమైన రంగులతో చీరలను మన రాష్ట్రంలో సిరిసిల్ల, కరీంనగర్ లో తయారు చేసిన చీరలను పంపిణీ చేస్తుంది.

## తెలంగాణ అడ్వకేట్స్ అకాడమీ ఏర్పాటు చేయాలి

**హైదరాబాద్ పెన్ పవర్:**రాష్ట్రంలో సేవలందిస్తున్న అడ్వకేట్ల నైపుణ్యాలు, ప్రమాణాలు పెరగటానికి ప్రభుత్వం తెలంగాణ అడ్వకేట్స్ అకాడమీ ఏర్పాటు చేయాలని హైకోర్టు సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్ కోరారు. ఈ మేరకు శనివారం ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బార్ కౌన్సిల్ కు ఆన్ లైన్ ద్వారా వినతిపత్రం పంపారు. అనంతరం సైదాబాద్ కళ్యాణ్ నగర్ లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో పోలీస్ అకాడమీ జ్యుడీషియల్ అకాడమీల తరహాలో అడ్వకేట్ అకాడమీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. అకాడమీ ఏర్పాటు ద్వారా రాష్ట్రంలోని పలు కోర్టుల్లో విధులు నిర్వహిస్తున్న 55 వేల మంది అడ్వకేట్స్ కు మారుతున్న చట్టాలు చట్ట సవరణల గురించి తెలుసుకొని అధ్యయనం చేయటానికి ఉపయోగపడుతుందని అన్నారు. రాజేంద్రనగర్ లో నూతన హైకోర్టు భవనాన్ని నిర్మిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం అక్కడే 30 ఎకరాల్లో అకాడమీ నిర్మించాలని, అకాడమీకి 50 కోట్లు రూపాయలు నిధులు కేటాయించాలని కోరారు. ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో న్యాయవాదుల పాత్రను ప్రభుత్వం గుర్తించాలని, తెలంగాణ రాష్ట్రంలో అడ్వకేట్ అకాడమీ ఏర్పాటు చేయటం ద్వారా దేశంలోని ఇతర రాష్ట్రాలకు తెలంగాణను ఆదర్శంగా నిలవాలని ఆయన కోరారు.

## అందెశ్రీకి పద్మశ్రీ ప్రకటించాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర ప్రభుత్వం ప్రముఖ కవి, తెలంగాణ రాష్ట్ర గీతం రచయిత అందెశ్రీకి పద్మశ్రీ ప్రకటించాలని ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి డిమాండ్ చేశారు. నేడు రవీంద్ర భారతి లో జరిగే అందెశ్రీ సంతాప సభకు ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల వద్ద నుంచి రవీంద్ర భారతికి పెద్ద సంఖ్యలో విద్యార్థులు సంతాప సభకు బయలుదేరి వెళ్లారు. కొత్తపల్లి తిరుపతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ లోని ట్యాంక్ బండ్ పైన అందెశ్రీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. సభకు విద్యార్థులు పెద్ద ఎత్తున తరలు రావాలని పిలుపునిచ్చారు.

## శ్రీకాకుళంల్లో జరిగిన రాత్రి దొంగతనాల కేసులు ఛేదించిన జిల్లా పోలీసులు

**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీకాకుళం రూరల్, శ్రీకాకుళం 2 టౌన్ మరియు శ్రీకాకుళం 1 టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో గత కొంతకాలంగా రాత్రి ఇండ్ల దొంగతనాల పై జిల్లా పోలీసులు ప్రత్యేక క్రైమ్ బృందాలు తో దర్యాప్తు జరిపి, మొత్తం 18 కేసులను ఛేదించి,పలు నేరాలకు పాల్పడిన దున్న కృష్ణ అరెస్ట్ చేశామని శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పత్రిక సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు.నిందితుడు వెస్ట్ బెంగాల్ నుంచి జిల్లాకు వచ్చి - నేరం చేసి వెళ్లిపోవడం అలవాటు. పక్కా ప్రణాళిక, ప్రత్యేక క్రైమ్ టీమ్ లతో నేరస్థుడిని అరెస్టు చేసామని జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి వెల్లడించారు. ఈ కేసులో చురుకుగా వ్యవహరించిన రూరల్ సర్కిల్ సిఐ కె. పైడిపు నాయుడు,సీసీఎస్ సిఐ %ా%. చంద్రమౌళి,సీసీఎస్ ఎస్సైలు రాజేష్,గణేష్,రూరల్ ఎస్సై కే. రాము మరియు వారి సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# వివేకా హత్య కేసులో కీలక మలుపు

**హైదరాబాద్ పెన్ పవర్:**

మాజీ మంత్రి వివేకా హత్య కేసు ఏళ్ల తరబడి సాగుతోంది. హత్య జరిగి ఇన్నేళ్లు అవుతున్నా ఇంత వరకు విచారణ కొలిక్కి రాలేదు. సీబీఐ జోక్యం చేసుకున్నప్పటికీ కేసుల తేలలేదు. ఇప్పుడు ఈ కేసు మరో మలుపు తిరిగింది. ఈ హత్య జరిగినప్పుడు నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే కర్నూలు రేంజ్‌లో వి.ఆర్‌లో ఉన్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జె. శంకరయ్యను పోలీస్ సర్వీస్ నుంచి తొలగించారు. ఈ కేసు వెలుగులోకి వచ్చినప్పుడు సరిగా డీల్ చేయలేదని ఆయనపై డీజీపీ యాక్షన్ తీసుకున్నారు. ఇప్పటికే పలు మార్లు నోటీసులు ఇచ్చి ఇప్పుడు ఉద్యోగం నుంచి తీసేశారు. దీంతో ఈ కేసులో భాగమైన వారందరిలో టెన్షన్ మొదలైంది. తర్వాత ఎవరిపై వేటు ఉంటుందా అనే చర్చ నడుస్తోంది.ఇంతలో ప్రభుత్వం మరో అడుగు వేసింది. వివేకా హత్యకేసులో అప్రూవర్ షేక్ దస్తగిరిని జైల్లో బెదిరించిన కేసుపై ఫోకస్ చేసింది. ఆయన్ని టార్గెట్ చేస్తున్నారని తెలిసినప్పటికీ ప్రత్యర్థులను జైలులోకి వెళ్లేందుకు అనుమతి ఇచ్చిన వారిపై వేటుకు రంగం సిద్ధమైంది. నాటి కడప జైలు అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్టు తెలుస్తోంది. దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్నారు. ఆయన కుమారుడు డాక్టర్ దేవిరెడ్డి చైతన్య రెడ్డి వైద్య శిబిరం నిర్వహణ పేరుతో జైల్‌లోకి వెళ్లారు. వీళ్లకు నాటి అధికారులు రూల్స్ బ్రేక్ చేసి అనుమతి ఇచ్చారని ప్రధాన ఆరోపణ. జైలు సూపరింటెండెంట్ ఐఎన్ హెచ్ ప్రకాశ్, డిప్యూటీ సూపరింటెండెంట్ కె. జవహర్‌బాబు, డీసీఎస్



డా. జి. పుష్పలత సహకరించినట్టు అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి. నాడు ఏం జరిగింది. ఎలా జరిగింది. ఈ ముగ్గురే కాకుండా ఇంకా ఎవరైనా ఇందులో భాగమై ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు చేసేందుకు ప్రత్యేక అధికారిని ప్రభుత్వం నియమించింది. కోస్తాంధ్ర రీజియన్ జైళ్లశాఖ డీఐజీ ఎంఆర్ రవికిరణ్ ఈ టీంను లీడ్ చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున కేసు ప్రెజెంటింగ్ అధికారిగా రాజమహేంద్రవరం జైలు సూపరింటెండెంట్ రాహుల్‌ను నియమించారు. వీళ్లు దీన్ని లోతుగా విచారించి మూడు నెలల్లోపల నివేదిక ఇస్తారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్టు హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు. నాడు విధులను నిర్లక్ష్యం చేసిన వాళ్లంతా ఇప్పుడు వివిధ ప్రాంతాల్లో ఉన్నారు. ప్రస్తుతం ఐఎన్ హెచ్ ప్రకాశ్ నెల్లూరులోని ఏపీ స్టోర్స్‌లో, జవహర్ బాబు విశాఖపట్నం కేంద్ర కారాగారంలో, డా పుష్పలత కడప జీజీహెచ్లో పనిచేస్తున్నారు. కొత్త నియమితులైన విచారణ అధికారులు ఈ ముగ్గురితోపాటు మరికొందర్ని విచారించనున్నారు. వివేకానందరెడ్డి హత్య కేసులో అప్రూవర్ గా మారిన షేక్ దస్తగిరిని 2023 అక్టోబరు 31న ఓ కేసులో జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం కడప కేంద్ర కారాగారానికి తరలించారు. ఆ తర్వాత నవంబరు 28న అధికారులు జైల్లో వైద్య శిబిరం నిర్వహించారు. దీనికి వివేకా హత్య కేసులో కీలక నిందితుడైన దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి కుమారుడు డాక్టర్ చైతన్య రెడ్డితో పాటు కడప శ్రీకర ఆసుపత్రికి చెందిన మరికొందరు వైద్యుల్ని రప్పించారు. అక్కడే చైతన్య రెడ్డి తనను బెదిరించారని దస్తగిరి కేసు పెట్టారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లు పాత పద్ధతిలోనే జీవో విడుదల, బీసీల మాటేంటి

**హైదరాబాద్ పెన్ పవర్:**

గ్రామ పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై తెలంగాణ ప్రభుత్వం జీవో విడుదలు చేసింది. రిజర్వేషన్లు 50 శాతం మించకుండా ప్రభుత్వం తాజాగా మార్గదర్శకాలు జారీ చేసింది. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచు, వార్డు సభ్యుల రిజర్వేషన్ల విధివిధానాలు ఖరారు చేస్తూ శనివారం జీవో రిలీజ్ చేసింది. దాంతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అనేది అధికారికంగా అమలు చేయడం సాధ్యం కాదని తేల్చింది. తెలంగాణ హైకోర్టు రిజర్వేషన్లపై ఇచ్చిన తీర్పు, రాజ్యాంగంలో పేర్కొన్న అంశాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఈ నిర్ణయం తీసుకుంది. వచ్చే నెలలో మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయని తెలిసింది.తెలంగాణలో పంచాయతీ ఎన్నికలకు సంబంధించి సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం రిజర్వేషన్లపై ఒక ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేసింది. రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని జారీ చేసిన జీవోలో ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ పరిమితి సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అనుసరించి నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల రిజర్వేషన్లలో రొటేషన్ పద్ధతిలో మార్పులు తీసుకురావాలని నిర్ణయించారు. ఈ మార్పుల ద్వారా రిజర్వేషన్ల ప్రక్రియలో పారదర్శకత మరియు సమాన అవకాశాలను కల్పించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ మార్పులన్నీ కమిషన్ నివేదిక ఆధారంగా రూపు దాల్చనున్నాయి.తెలంగాణలో పంచాయతీ రాజ్ సంస్థల ఎన్నికలు మూడు దశల్లో నిర్వహించనున్నారు. డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో ఈ ఎన్నికలు జరుగుతాయి. ఈ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఈ నెల (నవంబర్) 26 లేదా 27వ తేదీన ప్రకటించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పంచాయతీలకు సంబంధించిన ఆర్థిక సంఘం నిధులు ఫ్రీజ్ కావడంతో, ఈ ఎన్నికలను నిర్వహించాల్సిన అవసరం వచ్చింది. ముఖ్యంగా బీసీ రిజర్వేషన్ల వివాదం (బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంపు అంశం) కారణంగానే ఇప్పటివరకు ఈ ఎన్నికలు ఆలస్యం అవుతూ వచ్చాయి.ప్రభుత్వ నిర్ణయం ప్రకారం, గ్రామ పంచాయతీ మొదటి దశ ఎన్నికలు డిసెంబర్ 11వ తేదీన జరగనున్నాయి. ఈ దశలో 4,000కు పైగా గ్రామ పంచాయతీలు, 100 ఎంపీటీసీలు (%పీఽజం%) కవర్ అవుతాయి. ఆ తరువాత, రెండవ దశ ఎన్నికలు డిసెంబర్ 14వ తేదీన నిర్వహించనున్నారు. ఇందులో మరో 4,000 పంచాయతీలకు పోలింగ్ జరుగుతుంది. ఇక మూడవ, చివరి దశ ఎన్నికలు

డిసెంబర్ 17వ తేదీన నిర్వహించనున్నారు. ఇందులో మిగిలిన 4,769 పంచాయతీల ఎన్నికలను పూర్తి చేస్తారు. మొత్తంగా రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీలకు డిసెంబర్ లో మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల్లో సుమారు 1.67 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికల్లో లక్షకు పైగా అభ్యర్థులు పోటీ పడవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

# కాలం ఎవరిని గుర్తుంచుకోదు

**హైదరాబాద్ పెన్ పవర్:**కాలానికి జాలి లేదు, దయ అంతకంటే లేదు, ఎవరి మీద అభిమానం కానీ మమకారం కానీ అసలు లేనే లేదు. కాలం అన్నది ఒక ప్రవాహం. అది నిరంతరం ముందుకే వేగంగా ప్రవహిస్తుంది. వెనక్కి చూడడం దాని నైజం కాదు, అందువల్ల కాల ప్రవాహంలో చిన్న అల లాంటి మానవ జీవితంలో ఏ ఒక్క అల అయినా కాసింత తన ఉనికిని చాటుకున్నా కాలం ముందు అది అతి పరిమితం. అలాగే కాలాన్ని అనంతంగా చెబుతారు దానికి అతి తక్కువ మానవ జీవితంలో ఎవరో ఎక్కడో సాధించిన విషయాలను వాటి విజయాలను లిఖించి నిక్షిప్తం చేయడానికి తీరిక కానీ ఓపిక కానీ ఆసక్తి కానీ అసలు ఉండదు.



**కఠిన పదఘట్టనలతో :**

కాల పురుషుడు తన బలమైన పద ఘట్టనలతో వడివడిగా దాటుకుంటూ ముందుకు పోతాడు. ఆయన కాళ్ళ కింద నలిగే జీవితాలలో అద్భుతాలు సంభవించవచ్చు, భ్రష్టత్వాలు జరగచ్చు. కానీ కాలపురుషుడికి ఇవేమీ అసలు పట్టవు. అంతే కాదు ఏ వివక్ష ఏ మాత్రం లేదు. అల మీద తన గీత గీసి తానే గ్రేట్ అని ఎవరైనా భ్రమించుకున్నా దానికి కాలానికి సంబంధం లేదు. అది అలా చెరిగి చెదిరిపోతోంది. అలా ఎవరి జ్ఞాపకాలు అయినా ఎవరి ఘనకార్యాలు అయినా కాలగర్భంలో చాలా నిశ్శబ్దంగా కరిగిపోక తప్పదు.

**కాలతీతం లేదు :**

కాలాన్ని జయించిన వారు కానీ దానికి అతీతమైన వారు కానీ ఈ భౌగోళిక ప్రపంచంలో ఇప్పటిదాకా ఎవరూ లేరు అందుకే ఎవరి కీర్తి అయినా ఒక తరం రెండు తరాలకే పరిమితం మూడవ తరానికి వారు ఎవరో కనీసంగా తెలిసే అవకాశం లేదు. నిజంగా అలా తెలిసే మాట ఉంటే కాలం క్యాలెండర్ ఏనాడో ఈ చరిత్రలతో నిండా నిండిపోయి బరువెక్కిపోయి కాలం కదలకుండా ఏదో మూలన ఆగిపోక తప్పదు. అందుకే కాలం చూపు ముందుకే ఆ దుందుడుకే ఆ దూకుడే కాలానికి సహజ ఆభరణాలు. అవే మానవ జీవితం ఎంత అల్పమో స్పష్టంగా చాటి చెబుతూంటాయి.

**కీర్తి ఒక బుడగ :**


ఎవరి కీర్తి అయినా ఒక నీటి బుడగ. అది కాలానికి ఎంతో బాగా తెలుసు తానే గొప్ప అని ఎవరు మురిసినా అది ఒక యాభై వందేళ్ళ సంబరమే తప్ప మరేమీ కాదు, ఆ మీదట వేరొకరు వస్తారు, వారిదీ ఇదే తీరు. ఇవన్నీ చూసి సన్నగా నవ్వుకుంటూ కాలపురుషుడు తన పని తాను చేసుకుంటూ పోతాడు. అందుకే ఎవరైనా తాము ఎంతటి వారు అయినా తమ పని తాము చేశామని తమకు వచ్చిన అవకాశాలను తమకు ఇచ్చిన అతి తక్కువ కాల పరిమితిలో పూర్తి చేశామని సంతృప్తి చెందడమే ఉత్తమం.

**భ్రమల ప్రపంచంలో బతికేస్తూ :**

అంతే కాదు తాము సృష్టించుకున్న భ్రమల ప్రపంచంలో బతికేస్తూ తమకు సరి సాటి పోటీ ఎవరూ లేరని గర్వంగా భావిస్తూ కనుక ఉంటే వారి కథ కూడా కాలం చూసుకుంటుంది. కాలానికి గేలం వేసేవారు ఎవరూ పుట్టలేదు, కాలాన్ని కొలిచే వారు కానీ నిలదీసి నిలువరించేవారు కానీ ఇప్పటికి ఎవరూ లేరని కూడా తెలుసుకుంటే మనిషి తాను ఏంటో ఇంకా బాగా అర్థం చేసుకోగలుతాడు. ఎవరెన్ని చేసినా ఎంతలా విర్రవీగినా కాలం గీసిన గిరిలో మాత్రమే అన్నది మరచిపోరాదు. ఈ గుడుగుడు గుంచం ఆట అంతా కాలం చేసే మ్యాజిక్ అని తెలుసుకుంటే ఇంకా మంచిది. సో రాజా ది గ్రేట్ అని ఎంతలా కాలరెగరేసినా కాలం దెబ్బకు అంతా మటాష్.

# వాణిజ్య యుద్ధం : రూపాయి పతనం.. 90 దాటే ప్రమాదం

**హైదరాబాద్ పెన్ పవర్:**భారతీయ రూపాయి మరోసారి చరిత్రాత్మక కనిష్ఠాన్ని తాకింది, ఇది భారత ఆర్థిక వ్యవస్థలో తీవ్ర ఆందోళనలను రేకెత్తిస్తోంది. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి డాలర్‌తో రూపాయి విలువ ?89.66 వద్ద నిలిచింది. ఒకానొక దశలో ?89.71 వరకు జారిపోవడం మార్కెట్లలో భయాన్ని సృష్టించింది. గురువారంతో పోలిస్తే ఒక్క రోజులో ?1.03 పతనం నమోదు కావడం పెట్టుబడిదారులను కుదిపేసింది. రూపాయి 90 స్థాయిని దాటే ప్రమాదం అంచున నిలబడడం దేశ ఆర్థిక భవిష్యత్తుపై ప్రశ్నార్థకం వేస్తోంది.రూపాయి విలువ ఇంతలా పడిపోవడానికి అమెరికా%-%భారత్ వాణిజ్య చర్చల్లో స్పష్టత లేకపోవడమే ప్రధాన కారణంగా నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఆగస్టులో అమెరికా విధించిన భారీ టారిఫ్‌లు ఇప్పటికీ భారత ఎగుమతులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నాయి. వాణిజ్య అనిశ్చితి, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారత మార్కెట్ల నుంచి పెద్ద ఎత్తున తమ పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నారు. వార్తల ప్రకారం ఇప్పటివరకు %వి%16.5 బిలియన్ కంటే ఎక్కువ మొత్తాన్ని పెట్టుబడిదారులు భారత మార్కెట్ల నుంచి బయటకు తీసినట్లు సమాచారం. ఇది రూపాయిపై ఒత్తిడిని మరింత పెంచింది.



**డాలర్ బలపడటం %-% ఆర్బీఐ మౌనం**

ప్రపంచ మార్కెట్లలో డాలర్ బలోపేతం కావడం కూడా రూపాయి పతనానికి దోహదపడింది. అమెరికాలో ఉద్యోగాల సంఖ్య బలంగా రావడంతో డాలర్ మరింత బలపడింది. దీనితో పాటు, పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడుల కోసం అమెరికా వైపు మొగ్గుచూపారు. మరోవైపు, గతంలో రూపాయిని పతనం కాకుండా అడ్డుకునేందుకు జోక్యం చేసుకున్న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఈసారి మౌనం పాటించడం మార్కెట్లలో ప్రతికూల సంకేతాలు పంపింది. రూపాయికి మద్దతుగా ఆర్బీఐ రంగంలోకి దిగకపోవడంపై విశ్లేషకుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**మార్కెట్లలో ప్రతికూలత - సాధారణ ప్రజలపై ప్రభావం**

రూపాయి పతనం ప్రభావం వెంటనే భారత స్టాక్ మార్కెట్‌పై కనిపించింది. సెన్సెక్స్ ఒక రోజులోనే 400 పాయింట్లు క్షీణించింది. నిఫ్టీ సైతం 124 పాయింట్లు పడిపోయింది. బలహీన రూపాయి సాధారణ భారతీయుడిపై నేరుగా ప్రభావం చూపుతుంది. భారతదేశం అధికంగా దిగుమతులపై ఆధారపడిన నేపథ్యంలో దిగుమతి చేసుకునే ప్రతి వస్తువు ఖరీదవుతుంది. చమురు, పెట్రోల్ ధరలు, ఎలక్ట్రానిక్స్ వస్తువులు మొబైల్స్, ల్యాప్‌టాప్‌లు మొదలైనవి, దిగుమతి అయ్యే నిత్యావసర వస్తువులు.. వీటి ధరలు పెరిగే అవకాశం ఉంది, తద్వారా ద్రవ్యోల్బణం పెరిగి సామాన్యుడిపై భారం పెరుగుతుంది. ఎగుమతిదారులకు తాత్కాలిక లాభాలున్నప్పటికీ, వినియోగదారులకు, దిగుమతిదారులకు ఇది తీవ్ర నష్టాన్ని కలిగిస్తుంది.

**ముందు పరిస్థితి మరింత కఠినమా?**

మున్ముందు పరిస్థితి మరింత కఠినంగా మారే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అమెరికా ఇండియా ట్రేడ్ టాక్స్‌లో తక్షణ పురోగతి లేకపోతే రూపాయి త్వరలోనే 90 స్థాయిని దాటే ప్రమాదం ఉందని విశ్లేషకుల అంచనా. ఫారెక్స్ రిజర్వుల పరిమిత ప్రభావం: భారతదేశం వద్ద పెద్ద మొత్తంలో ఫారెక్స్ రిజర్వులు ఉన్నప్పటికీ, ప్రస్తుత వాణిజ్య ఉద్రిక్తతలు మరియు ప్రపంచ డాలర్ బలాన్ని తట్టుకునేందుకు వాటి ప్రభావం పరిమితంగానే ఉండవచ్చని అభిప్రాయం వ్యక్తమవుతోంది. వాణిజ్య సమస్య త్వరగా పరిష్కార దిశలోకి రాకపోతే, భారత ఆర్థిక వ్యవస్థపై దీర్ఘకాలిక ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. డాలర్ బలపడటం, వాణిజ్య ఉద్రిక్తతలు, ఆర్బీఐ నిర్లక్ష్యం ఈ మూడు శక్తులు కలిసి రూపాయిని కొత్త ప్రమాద స్థాయికి తీసుకెళ్తున్నాయి.